క్లుప్తంగా

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

సింహాద్రిపురం : వినాయకచవితి పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటుచేసే ప్రతిఒక్కరూ పోలీసుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అలాగే డీజేకి పర్మిషన్‌లేదన్నారు. నిమజ్జనం రోజు ప్రజలను ఇబ్బందులు పెట్టేవిధంగా ప్రవర్తించరాదన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ఎంతో మేలు చేస్తాయన్నారు.

వీఎన్‌పల్లె ఎంపీడీఓగా వెంకటరామిరెడ్డి



వీరపునాయునిపల్లె : స్థానిక మండల అభివృద్ధి అధికారిగా ఎ.వెంకటరమణారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. మైదుకూరు మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆయన బదిలీపై వెళ్లారు. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారుల సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ముద్దనూరు : కుందేళ్ళ వేటకువెళ్ళి విద్యుదాఘాతానికి గురై బాలమల్లయ్య(38) మృతి చెందాడు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన అంగలగుత్తి బాలమల్లయ్య బుధవారం రాత్రివేళలో యామవరం గ్రామ శివారులోని పొలాల్లోకి కుందేళ్ళను వేటాడానికి వెళ్ళాడు. దాహం వేయడంతో నీరు తాగడానికి ఓ పొలంలోని మోటర్ స్టాటరు వద్దకు వెళ్ళాడు. ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగలు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలి

వృద్ధుడి మృతి

జమ్మలమడుగు రూరల్ : గొరిగెనూరు గ్రామానికి చెందిన బొనం అబ్రహాం(75) సలివెందుల పొలాల్లో పడి మృతి చెందాడని పట్టణ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బొనం అబ్రహంకు కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం సరిగాలేదన్నారు. ఈనెల 1వ తేదీన ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆయన కుమారుడు తెలిపాడన్నారు. గురువారం సలివెందుల గ్రామ పొలాల్లో వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో ఆయన కుమారులకు సమాచారాన్ని అందించామన్నారు. కుమారుడు బొనం సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలి



ఇసుక పాయింట్లను పరిశీలిస్తున్న ఏడీ రామచంద్ర

కొండాపురం : ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలని మైనింగ్ అండ్ జియాలజి ఏడీ రామచంద్ర అధికారులను అదేశించారు. గురువారం మండలంలోని సబ్‌స్టేషన్ వెనుక భాగంలోని పెంజి అనంతపురం, చిత్రావతినది వంతెన సమీపంలోని ఇసుక పాయింట్, ఏటూరు, కె.వెంకటాపురం ఇసుక పాయింట్లను ఆయన పరిశీలించారు. ఇసుక పాయింట్ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఇసుక నిల్వతో పాటు పూర్తి వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో మైనింగ్ సిబ్బంది శ్రీనివాసులు, విమలమ్మ,ఎంపీడీఓ నాగప్రసాదు పాల్గొన్నారు.

రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నూరుబాషా సంఘం అధ్యక్షుడుగా రసూల్



పులివెందుల రూరల్ : రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నూరుబాషా సంఘం అధ్యక్షుడిగా రసూల్‌ను నియమించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల, కలమల్ల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ నరేష్‌బాబు, కలమల్ల ఎస్ఐ తిమోతిలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులకు పలు సూచనలు అందించారు. వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం ఉండే ప్రాంతాల్లో మండపాలు పెట్టరాదన్నారు. విద్యుత్ శాఖ అనుమతితో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు ఉపయోగించాలి, 11 గంటలకల్లా విగ్రహాల వద్ద కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు.

వినాయకుడి ప్రతిష్టకు మండపాలు సిద్ధం



ఎర్రగుంట్ల : వినాయకుడి విగ్రహ ప్రతిష్టకు మండపాన్ని సిద్ధం చేసిన దృశ్యం



క్రేన్ ద్వారా విగ్రహాలను ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని వీధులలో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. భారీ డేకరేషన్‌లతో మండపాలను సిద్ధం చేశారు. విద్యుత్‌దీపాలు, పూలతో మండపాలను అందంగా అలంకరించారు. గ్రామాలకు వినాయక విగ్రహాలను పట్టణం నుంచి ప్రత్యేక వాహనాలలో డప్పులు వాయిద్యాల మధ్య తీసుకువెళ్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పండుగను ఘనంగా నిర్వహించనున్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మం పై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

'గండి' ఆదాయం రూ.1.60 కోట్లు

చక్రాయపేట : శ్రావణ మాసం సందర్భంగా గండి వీరాంజనేయ స్వామికి వివిధ మార్గాల్లో రూ.1,59,90,540లు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. టికెట్ల ద్వారా రూ.37,96,196లు, లడ్డూ పులి హోర ప్రసాదాల వల్ల రూ.56,13,460లు, ప్రసాదం కవర్లు రూ.27,090లు, గదుల అద్దె రూ. 1,86,300లు, షాపింగ్ కాంప్లెక్స్ రూ. 3,29,200లు, తాత్కాలిక దుకాణాలు రూ.1,70,515లు, వివాహ కట్టడి ద్వారా రూ.30,000లు, తాత్కాలిక, శాశ్వత హుండీల ద్వారా రు.45,41,825లు, అన్నదాన విరాళాలు రూ.12,95,920లు, అలాగే మనియార్డర్‌ల ద్వారా కూడా ఆదాయం వచ్చిందని తెలిపారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : పురుగు మందుల దుకాణదారులు రైతులకు నకిలీ పురుగు మందులు, నిషేదిత బయోమందులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం వెల్లటూరు గ్రామంలోని పురుగు మందుల దుకాణాలను ఆయన అకస్మీకంగా తనిఖీ చేసి స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. మందులు విక్రయించిన ప్రతి రైతుకు బిల్లు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మాధవి, ఏఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్ పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశ్వర్లు

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ జడ్పీఎస్ హైస్కూల్‌ను గురువారం ఆర్డీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి బిల్డింగ్ సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకురావడంతో నూతన భవనాలు 15 రోజుల్లో పూర్తి కానున్నాయని అనంతరం అక్కడికి బదిలీ చేస్తామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని, హైస్కూల్ నూతన భవనాలను పరిశీలించారు. తహసీల్దార్ గుర్రప్ప, ఆర్ఐ సుజిత్, విఆర్ఓ పుష్పరాజ్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

వేంపల్లె : టి.వెలమవారిపల్లి గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసు కుని వారి వద్ద ఉన్న రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.

ఒక్కరి దానంతో ఇద్దరికి చూపు

చక్రాయపేట : ఒక్కరు నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపును ఇచ్చిన వారమవుతారని సురభి ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్యుడు రెడ్డెన్న తెలిపారు. గురువారం స్థానిక వైద్యశాలలో నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా వైద్యసిబ్బందికి నిర్వహించన అవగాహణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే దేశంలో ప్రతి యేటా 50 వేల మంది కంటిలోపంతో బాధపడుతున్నారన్నారు. నేత్ర దానాల వల్ల 20 వేల మందికి మాత్రమే చూపును ఇవ్వగలుగుతున్నట్లు తెలిపారు. వైద్యసిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో నేత్రదానంపై అవగాహణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సురభి వైద్యాధికారి శివప్రాద్, డాక్టర్ లావణ్య, ఎంపీహెచ్ఈవో రామకృష్ణ, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఈహెచ్‌వోలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

జమ్మలమడుగు రూరల్ : 15 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా ఉన్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని జమ్మలమడుగు స్టాఫ్ నర్స్‌లు గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా తాము 3 సంవత్సరాల 6 నెలల పాటు శిక్షణ పొంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చాలిచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఒకటిన్నర సంవత్సర కాలం శిక్షణ పొందిన ఎఎన్ఎంలను స్టాఫ్ నర్స్‌లుగా పదోన్నతి కల్పించి వారికి రాష్ట్ర ప్రభుత్వం జీవో అమలు చేయాలన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయి

కమలాపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం అని ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయి తెలిపారు. గురువారం కమలాపురం సెక్టార్‌లోని 14వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో 3వ వార్డు సచివాలయంకు సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్లు పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు తదితర వాటితో లోగో చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందన్నారు. అలాగే ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, చిక్కీలు తదితర వాటిలో అధిక పోషకాలు ఉంటాయన్నారు. ఇవన్నీ తక్కువ ఖర్చుతో వచ్చే పదార్థాలేనని, వాటిని అధికంగా తీసుకోవాలని సూచించారు. పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలున్న పదార్థాలను అధికంగా తీసుకోవాలన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు పాలు తాపించాలని, ఆపై పోషకాహారాన్ని అందిచాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ షంషాద్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కమలాపురం : ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవాలంటే విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కడప స్త్రీ, శిశు సంక్షేమ న్యాయ సలహాదారురాలు పర్వీన్‌నాజ్ తెలిపారు. గురువారం స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే ప్రతి విద్యార్థిని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు, గృహ హింస, సైబర్ నేరాలు జరిగితే 1098కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సీడీపీఓ వసంతబాయి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలు ఏదైన సమస్యలు ఎదురైతే తక్షణమే ఉమెన్ హెల్ప్ లైన్ 181కి కాల్ చేయాలన్నారు. సూపర్‌వైజర్లు షంషాద్ బేగం, జయలక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారితో పాటు దొంగ సర్టిఫికెట్లు సమర్పించి పింఛన్లు పొందిన వారిని విచారించి వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 18 పంచాయతీల్లో జరిగిన పనులు, అందులో చోటు చేసుకున్న అక్రమాల గురించి సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించారు. అలాగే ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే సహించబోనన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ నాగరత్నమ్మ, ఏపీడీ సోమశేఖర్ రెడ్డి ఎంపీడీఓ జ్యోతి, డీపీఓ రామలింగేశ్వర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి మధు, ఏపీఓలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే పిల్లల ఆరోగ్యం

చక్రాయపేట : సమతుల్య ఆహారం అందిస్తే చిన్న పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజక్టు సీడీపీవో సునీత తెలిపారు. గురువారం మండలంలోని సురభి గ్రామం గాజులపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల పోషణ మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులను ఉద్దేశించి మాట్లాడారు. గర్భిణులు పప్పుదినుసులు, ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. బిడ్డ పుట్టగానే ముర్రు పాలు తాగించాలన్నారు. కనీసం 6 నెలల వరకు తల్లి పాలు బిడ్డకు తాగించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుభద్రమ్మ, అంగన్‌వాడీ టీచర్ రమణమ్మ, సహాయకురాలు అంజనమ్మ చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : గర్భిణులుగా ఉన్న మహిళలు ప్రతి రోజు తీసుకునే ఆహారంలో మంచి పోషకాహారం ఉండే విధంగా చూడాలని ఐసీడీఎస్ అధికారిణి రాజేశ్వరిదేవి తెలిపారు. గురువారం మోరగుడి గ్రామంలోని శ్రీరాములపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవాలను నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంఐ పాల్గొన్నారు.

గులాబీరంగు పురుగు నివారణతోనే దిగుబడులు



కొత్తపల్లె గ్రామం వద్ద పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారి

వేముల : ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తిపంటలో గులాబీరంగు పురుగు నివారణతోనే అధిక దిగుబడి సాధించవచ్చని సీనియర్ శాస్త్రవేత్త మంజునాథ్ తెలిపారు. మండలంలోని వి.కొత్తపల్లెలో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పత్తి పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి పంటకు గులాబీ రంగు పురుగు ఆశించిందన్నారు. పంటవేసిన 60 రోజుల నుంచి పంటలో కాయతొలిచే పురుగు, ముఖ్యంగా గులాబీ రంగు పురుగు రాకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వేపనూనె కషాయం, ఎకరానికి 4 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటకు పురుగు ఆసించినచో ప్రొపానోపాస్ లీటరు నీటికి 2 ఎంఎల్ చొప్పున లేదా థయోడికార్బ్ లీటరు నీటికి 1.5 గ్రాముల చొప్పున లేదా క్వినాల్‌పాస్ లీటరు నీటికి 2.5 ఎంఎల్ చొప్పున మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. పంట చివరి దశలో ఉన్నట్లైతే పురుగు నివారణకు లాంబ్డా సైహలాత్రిన్ లీటరు నీటికి 1ఎంఎల్ చొప్పున పిచికారీ చేసినట్లైతే పురుగుల ఉధృతి నివారించవచ్చన్నారు. పత్తి పంటలో రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలని, తెగుళ్లు, పురుగులు దరిచేరకుండా ముందస్తు చర్యలతో పంట బాగా ఉంటుందని వివరించారు. రైతులు పంట సాగుచేశాక సకాలంలో పురుగు మందులను పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, జిల్లావనరుల కేంద్రం ఏఓ నాగభూషణ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, ఆర్ఎస్‌కె ఎంపీఈఓ లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

వేంపల్లె : పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణతోనే అధిక దిగుబడి సాధించవచ్చునని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్ తెలిపారు. గురువారం వేంపల్లి మండలంలోని కత్తలూరు గ్రామంలో ప్రత్తి పంట పొలాలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ,వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు సందర్శించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్ రెడ్డి, స్థానిక మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : గులాబీరంగు పురుగు నివారణతోనే పత్తిపంటలో అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. గురువారం పెద్దరంగాపురంలో ప్రత్తి పంట పొలాలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సందర్శించారు. పత్తి పంటలో గులాబీరంగు పురుగును గమనించామన్నారు. పంట వేసిన 60 రోజుల నుంచి పంటలో కాయ తొలిచే పురుగు ముఖ్యంగా గులాబీ రంగు పురుగు రాకమునుపే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసా య అధికారి నాగభూషణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ పురుషోత్తంరెడ్డి వర్ధంతి



పురుషోత్తంరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : దివంగత వైఎస్ పురుషోత్తమరెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు విలియం సత్యానందరెడ్డి, బ్రదర్ రఘుకర్‌లు గురువారం వైఎస్ బరియల్ గ్రౌండ్‌లోని ఆయన సమాధికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు నివాళులర్పించారు. పురుషోత్తంరెడ్డి డాక్టర్‌గా, ఎమ్మెల్యేగా పులివెందుల నియోజకవర్గ ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు గృహోపకరణాలు వితరణ

స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో గోటూరు చిన్నప్ప, బ్రదర్ రఘుకర్‌లతో కలిసి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. పురుషోత్తంరెడ్డి కుమారుడు విలియం సత్యానందరెడ్డి సమకూర్చిన గృహోపకరణాలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. భవిత స్కూలు మానసిక వికలాంగులైన విద్యార్థులకు క్యారియర్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చెన్నమ్మ, భవిత స్కూలు రీసోర్స్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కేసులు రాజీ అయ్యేలా కృషి చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కమలాపురం : ఈనెల 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాబాఫక్రుద్దీన్ తెలిపారు. గురువారం ఆయన కమలాపురం సబ్ జైలును సందర్శించి జైలు పరిసరాలు పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖీ మాట్లాడారు. అనంతరం పోలీస్, కోర్టు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. కోర్టు సిబ్బంది, న్యాయ వాదులు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేసి ఈనెల 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు. ఇరు వర్గాలను పిలిచి వారితో మాట్లాడి వారి మధ్య సయోధ్య కుదిర్చి కేసులు రాజీ చేసి పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ గంగాధర్, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు, డైరెక్టర్ ఏవీఎస్ కుమార్ స్వామి గుప్తా మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకుల పాత్ర ఎక్కువగా ఉన్నదని ఉద్బోధించారు. కార్యక్రమంలో డాక్టర్ సి.వి.విశ్వనాధరావు, శ్రీ కవి వరప్రసాదరావు, ప్రొఫెసర్ ఎం.రామసుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, ఐక్యు ఎసి డాక్టర్ కె.సతీష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సమాజ మార్గ నిర్దేశకులు గురువులేనని ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి, శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి చక్రపాణిరెడ్డిలు తెలిపారు. వారు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు యశోదను కరస్పాండెంట్ దంపతులు సన్మానించారు.

ఎర్రగుంట్ల : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయదినోత్సవాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణ ధరించి సంబరాలు చేసుకున్నారు.

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ముద్దనూరు : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి ఉపాధ్యాయ బృందం నివాళులర్పించారు.

సింహాద్రిపురం : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కోవరంగుట్టపల్లిలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే పదవ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సుధామణి, దీక్షిత, సాయి కీర్తన, లక్ష్మి నరసింహలకు ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర, సుబ్బరాయుడులు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.